క్లుప్తంగా

వాంబే కాలనీలో నీటి పరీక్షలు



పాయకాపురం(విజయవాడరూరల్): వాంబే కాలనీలో వీఎంసీ సరఫరా చేస్తున్న తాగునీటి సరఫరా రంగు మారి రావడంపై సాక్షి దినపత్రికలో గురువారం కలుషిత నీరు తాగేదెలా సారూ! శీర్షికతో ప్రచురితమైన కథనానికి వీఎంసీ అధికారులు స్పందించారు. వాంబే కాలనీలో స్థానికుల సమక్షంలో క్లోరిన్ టెస్ట్ నిర్వహించారు. ఆయిల్ టెస్టింగ్‌లో నీరు ఎల్లో రంగు రావడంతో నీటిలో ఎలాంటి తేడా లేదని ఏఈ సతీష్ తెలిపారు. నీటిని వేడి చేసి చల్లార్చిన తర్వాత తాగాలని సూచించారు.

మధుర స్వరాల గాయని బాలసరస్వతి



విజయవాడ కల్చరల్: మధుర స్వరాల గాయని రావు బాలసరస్వతి అని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు అన్నారు. నగర సాహితీ, సాంస్కృతిక సంస్థల ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం విలాస్‌లోని కార్యాలయంలో గురువారం బహుభాషా నటి రావు బాల సరస్వతి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ తొలితరం గాయనిగా ఆమె గుర్తింపు తెచ్చుకున్నారని తెలిపారు. తెలుగు, తమిళం, మళయాళం, సింహళం భాషల్లో పాటలు పాడరన్నారు. విశ్రాంత పోలీస్ అధికారి కె.డేవిడ్‌రాజు మాట్లాడుతూ చిన్నతనంలోనే పాటలు పాడటం ప్రారంభించారని పేర్కొన్నారు. ఆమె పాటలు తెలుగు వారి హృదయాల్లో చెరగని ముద్రవేసుకున్నట్లు తెలిపారు. సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు పరుచూరి విజయలక్ష్మి, బోడి ఆంజనేయరాజు, ఎంవీ మంగపతి, శ్యాంప్రసాద్, చిట్టబ్బాయ్, మధు, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు. బాల సరస్వతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మార్కెట్‌లోకి ది ఆల్ న్యూ గ్రాండ్ 'విక్టోరిస్'



పెనమలూరు: కానూరు సంతోష్ మారుతీ సుజుకీ షోరూమ్‌లో గురువారం మారుతీ సుజుకీ విక్టోరిస్ కారును మార్కెట్‌లోకి విడుదల చేశారు. గొల్లపూడి కమర్షియల్ మార్కెట్ అధ్యక్షుడు పి.నాగేశ్వరరావు, ఎస్‌బీఐ ఆర్‌ఎం రాచపూడి రాఘవరావు విక్టోరిస్‌ను ఘనంగా ఆవిష్కరించారు. ఆర్‌ఎం రాఘవరావు మాట్లాడుతూ.. వినియోగదారుల కోసం విక్టోరిస్‌కు ఎస్‌బీఐ 100 శాతం ఆన్‌రోడ్ ఫండింగ్ ఫైనాన్స్ సదుపాయం కల్పిస్తుందన్నారు. సంతోష్ మారుతీ సుజుకీ షోరూమ్ మేనేజింగ్ డైరెక్టర్ చుక్కపల్లి శ్రీకాంత్ మాట్లాడుతూ.. విక్టోరిస్ మూడు వేరియంట్‌లలో ఉందన్నారు. హైబ్రీడ్, స్మార్ట్ హైబ్రీడ్, సీఎన్‌జీలు బుకింగ్‌లు చేసుకోవచ్చని వివరించారు. సంతోష్ మారుతీ సీవో జి.శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ.. భారత్ ఎన్‌కాప్ రేటింగ్‌లో 5 స్టార్ వచ్చిందని, తమ వద్ద ఇప్పటికీ 100కు పైగా కార్లు బుకింగ్స్ వచ్చాయని, డెలివరీ ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖులు, వినియోగదారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాబా మందిరానికి వాటర్ కూలర్ వితరణ



మధురానగర్(విజయవాడసెంట్రల్): బాబా భక్తులకు కొంగు బంగారంగా విరాజిల్లుతున్న ఆంధ్రా షిరిడీ ముత్యాలంపాడు సాయిబాబా మందిరానికి గురువారం దాత సత్యనారాయణపురం దుర్గా డిపార్ట్‌మెంట్ స్టోర్స్ అధినేత రామాంజనేయులు రూ.35వేలు విలువ చేసే కూలర్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందిరంలో అధ్యాత్మిక సేవలతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించటం తనను ఆకట్టుకుందని చెప్పారు. తన వంతు బాధ్యతగా కూలర్ అందజేస్తున్నట్లు తెలిపారు. మందిర సేవా కార్యక్రమాలలో తాను కూడా భాగస్వామి అయ్యినందుకు సంతోషంగా ఉందని పేర్కొన్నారు. మందిర గౌరవాధ్యక్షులు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి మాట్లాడుతూ మందిరం తలపెట్టిన ఏ కార్యక్రమం అయినా దానికి భక్తులు, దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిదని చెప్పారు. భక్తుల దాతల మనోభావాలకు అనుగుణంగా మరింత మెరుగైన సేవలు అందిస్తామన్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి దాతకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది.

డంపింగ్ కేంద్రంగా రైల్వేస్టేషన్ రోడ్డు!

- చెత్తా చెదారం, ఇతర వ్యర్థాలకు నిలయంగా మారిన వైనం
- కనీసం రాకపోకలకు సాగించేందుకు సైతం ఇబ్బందులు
- అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు వినతి



రైల్వేస్టేషన్ రోడ్డులో చెత్తా చెదారం



మధురానగర్ రైల్వేస్టేషన్ సర్వీసు రోడ్డు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ రైల్వేస్టేషన్ రోడ్డు డంపింగ్ కేంద్రంగా మారింది. అధికారుల నిర్లక్ష్యంతో ఒకప్పుడు నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డు ఇప్పుడు పిచ్చి మొక్కలు, చెత్తచెదారం, వ్యర్థాలతో అధ్వానంగా తయారైంది. మధురానగర్ ఆర్‌యూబీ పనుల్లో భాగంగా రైల్వే స్టేషన్ నుంచి బయటకు వచ్చేందుకుగానూ రైల్వేస్టేషన్ సర్వీసు రోడ్డులో అండర్ బ్రిడ్జి నిర్మించేందుకు పనులు చేపట్టారు. ఈ క్రమంలో ఇద్దరు వ్యక్తులు మృత్యువాత పడ్డారు. దీంతో అధికారులు ఇక్కడ అండర్ బ్రిడ్జి పనులు నిలిపివేశారు. అప్పటి వరకు తవ్విన రోడ్డును పూడ్చివేసి వదిలి వేశారు. అయితే అప్పటి నుంచి ఈ రోడ్డును పట్టించుకునే నాథుడే లేకపోవటం వల్ల పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగిపోయాయి. ఇక్కడ రైల్వే వారు క్లీన్ చేస్తారంటూ వీఎంసీ సిబ్బంది వీఎంసీ వారు చేస్తారంటూ రైల్వే సిబ్బంది వంతులు వేసుకోవటం వల్ల రెంటికీ చెడ్డ రేవడిలా రోడ్డు పరిస్థితి ఏర్పడింది.

ఇష్టారాజ్యంగా డంపింగ్.....

ఇక్కడ స్థానికులు, స్థానికేతరులతో పాటు పారిశుద్ధ్య సిబ్బంది సైతం వారు సేకరించిన చెత్తను ఇక్కడే పారవేస్తున్నారు. గట్టిగా అడిగితే చెత్తను పారిశుద్ధ్య సిబ్బంది తగలపెట్టి చేతులు దులుపుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అలాగే వ్యర్థాలు చెత్తచెదారం పేరుకుపోవటం వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా మారటంతో పాటు దోమలు, క్రిమికీటకాలకు ఆవాసకేంద్రంగా మారింది. పందులు సైతం సంచరిస్తున్నా కనీస చర్యలు తీసుకోవటం లేదని వాపోతున్నారు. నగరంలో ఒక వైపు అనారోగ్య సమస్యలతో ప్రజలు అల్లాడుతుంటే కనీస పరిశుభ్రత చర్యలు తీసుకోకపోవటం అధికారుల బాధ్యతా రాహిత్యంను తెలియచేస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విషసర్పాల సంచారం....

పిచ్చి మొక్కలు పెరిగిపోవటం వల్ల దోమలతో పాలు విషసర్పాల సంచారం అధికమైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాత్రిపూట బయటకు రావాలంటేనే భయమేస్తుందని అంటున్నారు. ఈ రోడ్డు అధ్వానంగా మారటంతో ఇక్కడ రైల్వేస్టేషన్‌లో దిగాల్సిన ప్రయాణికులు సైతం మెయిన్ స్టేషన్‌కు వెళ్లి అక్కడ నుంచి తిరిగి వస్తున్నారు.

అధికారులు స్పందించాలి



ఒకప్పుడు ప్రయాణికులతో కళకళలాడిన ఈ రోడ్డు ఇప్పుడు చెత్తచెదారం, క్రిమికీటకాలు, పందులకు ఆవాసకేంద్రంగా మారింది. అధికారులు చొరవ తీసుకుని రోడ్డుపై చెత్తచెదారం పిచ్చి మొక్కలను తొలగించి రాకపోకలకు వీలుగా తయారు చేయాలి. కేంద్రీయ విద్యాలయంకు వెళ్లే విద్యార్థులు ఈ చెట్లతుప్పల మధ్య లోంచి బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి రోడ్డును రాకపోకలకు వీలుగా సరిచేయాలి.

– బోను పూర్ణ, మధురానగర్

బాలికలకు విద్య, సమాన అవకాశాల కల్పనకు కృషి

జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ



పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వివక్షలేని వాతావరణంలో బాలికలకు సమాన అవకాశాలు, నాణ్యమైన విద్య, ఆరోగ్య సేవల కల్పనకు కృషి చేద్దామని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ పిలుపునిచ్చారు. బాలికలు అన్ని విధాలా అభివృద్ధి చెందేందుకు కృషి చేసి వారి బంగారు భవితకు బాసటగా నిలవాలన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం, పెయింటింగ్ తదితర పోటీల్లో విజేతలకు కలెక్టరేట్‌లో పతకాలు, బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలికలు బాగా చదువుకొని కెరీర్‌లో ఉన్నతంగా ఎదగాలని సూచించారు. ప్రతి బాలికకు సమానత్వం, సరైన అవకాశాలు కల్పించడం ద్వారా ఉన్నత స్థానాలకు ఎదుగుతారన్నారు. అత్యున్నత స్థానంలో ఉన్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళామణులను ఉదహరిస్తూ ఇలాంటి గొప్ప వ్యక్తుల నుంచి స్ఫూర్తి పొందాలని కోరారు. ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలను సద్వినియోగం చేసుకొని జీవితంలో ఎదగాలని తెలిపారు. వివక్ష, బాల్య వివాహాలు, హింస వంటి వాటికి అడ్డుకట్ట వేసేందుకు సమన్వయ శాఖల అధికారులు, సిబ్బంది కలిసికట్టుగా కృషిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, జిల్లా శిశు సంక్షేమ, సాధికారత అధికారిణి షేక్ రుక్సానా సుల్తానా బేగం, డీఈవో యూవీ సుబ్బారావు, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ రజనీ కుమారి, డా. జె.ఇందుమతి, డాక్టర్ మాధవి, గైడ్ టీచర్స్, విద్యార్థులు, తల్లిదండ్రులు, వివిధ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అండర్ బ్రిడ్జి పనులు ప్రారంభించాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న బాబూరావు, సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వాంబే కాలనీ మధురానగర్ ప్రాంతాల మధ్య రైల్వే అండర్ బ్రిడ్జి పనులు ప్రారంభించాలని కొన్ని దశాబ్దాలుగా సీపీఎం ప్రజా పోరాటాలు చేస్తుందని.. వాంబే కాలనీ అండర్ బ్రిడ్జిపై పాలకులు ప్రకటనలకే పరిమితం కాకుండా వెంటనే ప్రారంభించేలా చూడాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు డిమాండ్ చేశారు. వాంబేకాలనీలో చేపట్టబోయే అండర్ బ్రిడ్జి పనులను వెంటనే ప్రారంభించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో గురువారం ఆందోళన చేపట్టారు. ప్రజా పోరాటాలతోనే అండర్ బ్రిడ్జి ఏర్పాటు కల సాధ్యమవుతుందని తెలిపారు. అండర్ బ్రిడ్జి నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి నిధులు తక్షణం మంజూరు చేయించాలని కోరారు. సీపీఎం సెంట్రల్ సిటీ నాయకులు బి.రమణ రావు, కె.దుర్గారావు, ప్రజా సంఘాల నాయకులు టి. ప్రవీణ్, ఎస్‌కే పీర్ సాహెబ్, సిహెచ్ శ్రీనివాస్, రత్నకుమారి, బి.రాంబాబు, అప్పన్న, రవి తదితరులు పాల్గొన్నారు.

నవంబరు 25న భగవద్గీత పోటీలు

విజయవాడ కల్చరల్: గీతా జయంతి సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నవంబరు 25న భగవద్గీత పోటీలు నిర్వహిస్తున్నట్లు ధర్మ ప్రచార పరిషత్ సూపరింటెండెట్ ఎం.కాంతికుమార్ తెలిపారు. టీటీడీ కల్యాణ మండపంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పోటీల్లో ఉచితంగా పాల్గొనవచ్చని చెప్పారు. 6నుంచి 9 వ తరగతి వరకు గుణత్రయ విభాగం అధ్యాయంలో, 10 తరగతి, ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకు దైవాసుర సంపద్విభాగ యోగ అధ్యాయంలో, 18 నుంచి 45 సంవత్సరాల వరకు నిత్యజీవితంలో భగవద్గీత అంశంగా మాట్లాడాల్సి ఉంటుందని చెప్పారు. విజేతలకు బహుమతులు అందిస్తామని పేర్కొన్నారు. గాంధీనగర్‌లోని చిట్టూరి స్కూల్లో పోటీలు ప్రారంభమవుతాయని తెలిపారు. ప్రోగ్రామ్ అసిస్టెంట్ సీవీకే ప్రసాద్ మాట్లాడుతూ పోటీలో పాల్గొనేవారు 7032255499 నంబరులో సంప్రదించాలని సూచించారు. సమావేశంలో ధర్మప్రచార పరిషత్ సభ్యులు బొగ్గవరపు బాలకోటేశ్వరరావు, బొమ్మారెడ్డి సుధాకర్‌రెడ్డి, నండూరి తాండవకృష్ణ, వల్లావరపు వెంకటబాబు, మంగిపూడి వెంకట శాస్త్రి, వెంకట సత్యదుర్గాంబ, శ్రీనివాస్, శోభన్ పాల్గొన్నారు. భగవద్గీత పోటీల పోస్టర్‌ను అతిథులు ఆవిష్కరించారు.

లక్కీడిప్ విజేతలకు బహుమతులు అందజేత



విజేతలకు బహుమతులు అందిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక పున్నమిఘాట్‌లో జరుగుతున్న గ్రేట్ అమరావతి షాపింగ్ ఫెస్టివల్‌లో ప్రతి రోజూ లక్కీ డిప్ డ్రా తీసి బహుమతులు ప్రదానం చేస్తున్నారు. అందులో భాగంగా గురువారం రాత్రి లక్కీ డిప్ విజేతలకు జిల్లా కలెక్టర్ డాక్టర్ జీ లక్ష్మీశ బహుమతులు అందజేశారు. జీఎస్‌టీ సంస్కరణల ఫలితంగా అనేక వస్తువులపై ధరలు తగ్గిన క్రమంలో పున్నమి ఘాట్‌లో వివిధ రకాల స్టాల్స్ ఏర్పాటు చేశారు. ప్రజలు వచ్చి షాపింగ్ చేయటం ద్వారా లక్కీ డ్రాలో బహుమతులు కూడా గెలుచుకుంటున్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, జీఎస్‌టీ జాయింట్ కమిషనర్ ఎస్.ప్రశాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



స్కిట్‌లు, డ్యాన్స్‌లతో వైద్యుల నిరసన



తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని గత కొన్ని రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పీహెచ్‌సీల్లోని వైద్యులు ఆందోళన బాట పట్టారు. అయితే ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన రాకపోవడంతో వారి ఆందోళనలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కేవలం దీక్షా శిబిరంలో మాత్రమే కాక, జనసమ్మర్థం అధికంగా ఉండే మాల్స్‌లోనూ ఫ్లాష్ మాబ్‌లు నిర్వహిస్తూ తమ ఆవేదనను స్కిట్‌లు, పాటల రూపంతో ప్రజలకు వివరిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం విజయవాడ బెంజిసర్కిల్ వద్ద నున్న ట్రెండ్ సెట్‌మాల్‌లో యువ వైద్యులు వినూత్నంగా నిరసన తెలిపారు.

– సాక్షి ఫొటో గ్రాఫర్, విజయవాడ

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సీతారామపురం సబ్ స్టేషన్, 11 కేవీ సూర్యారావుపేట ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8.15 గంటల నుంచి 10.15 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. దుర్గాఅగ్రహారం కాలువ గట్టు, సీతారామపురం వీఎంసీ డ్రెయినేజీ పంపు హౌస్, కొత్తవంతెన రోడ్, జనతా ప్రెస్ రోడ్, బోడేపూడి వారి వీధి, కాట్రగడ్డ వారి వీధి, అంకమ్మ తల్లి టెంపుల్ ఏరియా, అయ్యన్నాయుడు వీధి, దాసరి వారి వీధి, సూర్యనారాయణ వీధి, బోయపాటి వారి వీధి విజయా హాస్పిటల్ ఏరియా, జడగం వారి వీధి, వేమూరి వారి వీధి, ఏలూరు రోడ్ ఆంజనేయ స్వామి టెంపుల్ ఏరియా, డోర్నకల్ రోడ్ వీధిరాజు మేడ ఏరియా, గోపరాజు రామచంద్రరావు రోడ్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సాహితీవేత్త కొల్లూరి మృతి



కొల్లూరి (ఫైల్)

విజయవాడ కల్చరల్: నగరానికి చెందిన సాహితీవేత్త, ఎక్స్‌రే సాహిత్య సేవా సంస్థ వ్యవస్థాపకుడు కొల్లూరి(75) అనారోగ్యంతో గురువారం సాయంత్రం మృతి చెందారు. దాదాపు 50 సంవత్సరాలుగా సాహిత్యంరంగంలో ఆయన ఉన్నారు. ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థను స్థాపించి 27 సంవత్సరాలుగా ప్రతి నెలా వెన్నల పేరుతో కవిత్వ పాఠశాలను నిర్వహిస్తున్నారు. వివిధ రంగాల్లోని ప్రముఖుల సేవలను గుర్తించి వారికి పురస్కారాలను అందజేస్తున్నారు. అంజలి మాసపత్రికను స్థాపించి కొత్తతరం రచయితలకు వేదిక కల్పించారు. లయన్స్ క్లబ్, వాకర్స్ క్లబ్, అంజలి క్లబ్ ద్వారా సేవా రంగంలో గుర్తింపు తెచ్చుకున్నారు. వివిధ సాంస్కృతిక సంస్థలు కొల్లూరి సేవలను గుర్తించి పురస్కారాలను అందజేశాయి. 2025 సంవత్సరంలో రాష్ట్ర పుభుత్వం ఉగాది పురస్కారం అందజేసింది.

కాపర్ వైర్ బాక్సులు మాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గోడౌన్‌లో కాపర్ వైర్ బాక్సులు మాయమైన ఘటన గొల్లపూడి పంటకాలువ రోడ్డులోని గోల్డ్‌మెడల్ ఎలక్ట్రికల్స్ ప్రైవేటు లిమిటెడ్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... పంట కాలువ రోడ్డులోని గోల్డ్‌మెడల్ గోడౌన్‌లో ఓపెన్ ప్లేస్‌లో ఉంచిన 210 కార్టన్ల కాపర్ వైర్ బాక్సులు అదృశ్యమయ్యాయి. గోల్డ్ మెడల్ ఏరియా సేల్స్ మేనేజర్ ముఖేష్ జైన్ సెప్టెంబర్ 21వ తేదీ రాత్రి 8 గంటల ప్రాంతంలో గౌడౌన్ తాళం వేసుకుని ఇంటికి వెళ్లిపోయాడు. మరుసటి రోజు ఉదయం వచ్చి చూడగా గోడౌన్ ఓపెన్ స్పేస్‌లో ఉంచిన కాపర్‌వైర్ బాక్సులు కనిపించలేదు. గౌడౌన్‌తోపాటు చుట్టుపక్కల వెతికినా బాక్సులు దొరకలేదు. గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించి ఉంటారన్న అనుమానంతో సేల్స్ మేనేజర్ ముఖేష్ జైన్ భవానీపురం స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

కొట్లాట కేసులో నిందితులకు జైలు శిక్ష

విజయవాడలీగల్: కొట్లాట కేసులో నిందితులపై నేరం రుజువైనందున 1వ అడిషనల్ చీఫ్ జ్యూడిషయల్ మెజిస్ట్రేట్ ఎం.ఎస్.కరీముల్లా నిందితులకు ఒక్కొక్కరికి 6 నెలల సాధారణ జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. పోలీసుల కథనం ప్రకారం.... ఎస్.ఆర్.ఆర్.కళాశాల సమీపంలో నీళ్లు పట్టుకునే విషయంలో మహిళల మధ్య ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో దాడి చేసిన నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. ప్రాసిక్యూషన్ తరుపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.సత్యవాణి, సీఎంఎస్ ఇన్‌స్పెక్టర్ జగదీశ్వరరావు, మాచవరం ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రకాష్ పర్యవేక్షణలో ఏడుగురు సాక్షులను విచారించారు. అనంతరం నిందితులైన వడ్డాది పద్మ, వడ్డాది ఏడుకొండలు, పాటిబండ్ల చిన్నమ్మలపై నేరం రుజువైనందున గురువారం న్యాయమూర్తి ఎం.ఎస్.కరీముల్లా పై విధంగా తీర్పు ఇచ్చారు.

కోటి సంతకాల సేకరణ ప్రారంభం



పాయకాపురం(విజయవాడరూరల్): కూటమి ప్రభుత్వం తల పెట్టిన మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం రాజీవ్‌నగర్ వడ్డెర కాలనీలో గురువారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు వడ్డెర కాలనీలో ప్రతి ఇంటికి వెళ్లి సంతకాల సేకరణ చేశారు. డివిజన్ ప్రెసిడెంట్ పసుపులేటి యేసు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నాయకులు మాన్యం జగదీష్, బూత్ కన్వీనర్లు వి.చిన్ని నరసయ్య, పి.దుర్గారావు, ఆర్.యేసు, ఎ.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. 61వ డివిజన్ వాంబే కాలనీలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ చేపట్టారు. డివిజన్ ప్రెసిడెంట్ నాలం బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆర్ఎస్ నాయుడు, డివిజన్ మహిళా ప్రెసిడెంట్ బి.కళ్యాణి, బీసీ ప్రెసిడెంట్ వి.వెంకటేశ్వరరావు, ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ సైలీష్ మధు, మైనార్టీ సెక్రటరీ ఎండీ రఫీ, డి.రాంబాబు, ఎస్.దుర్గాప్రసాద్‌రెడ్డి, వెంకటలక్ష్మి, రాజ్యలక్ష్మి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణపురం(విజయవాడ సెంట్రల్): వైఎస్సార్ సీపీ 32వ డివిజన్ ఆధ్వర్యంలో పార్టీ నేతలు అయోధ్యనగర్‌లో గురువారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుండె సుందర్‌పాల్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో మెడికల్ కాలేజీలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడానికి వ్యతిరేకంగా స్థానికుల నుంచి సంతకాలు సేకరించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరం త్రివేణి, శ్యాంబాబు, సువర్ణరాజు, బత్తుల సుబ్బారావు, పుప్పాల దుర్గాప్రసాద్, జె.వి రెడ్డి, ఆనంత్, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ఉపసంహరించుకోవాలి

- కోటి సంతకాలతో ప్రజావాణి వినిపిద్దాం
- మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు



కోటి సంతకాల కార్యక్రమంలో భాగంగా సంతకాలు సేకరిస్తున్న మల్లాది విష్ణు, పూనూరు గౌతంరెడ్డి

మధురానగర్(విజయవాడసెంట్రల్): చంద్రబాబుకు పేదలు అంటే అలుసు అని వారికి నాణ్యమైన వైద్యం, వైద్య విద్య అందకుండా చేసేందుకే వైద్య కళాశాలలను ప్రైవేటీ కరణ చేస్తున్నారని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త మల్లాది విష్ణు తెలిపారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 28వ డివిజన్ బీఆర్టీఎస్ రోడ్డులో గురువారం వైఎస్సార్ సీపీ కోటి సంతకాల సేకరణ చేపట్టారు. వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డితో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొని సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి పాలనలో వైద్య వ్యవస్థ నిర్వీర్యం అయ్యిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరోగ్యశ్రీ వల్ల జగన్‌మోహన్‌రెడ్డికి ఎక్కడ మంచి పేరు వస్తుందోననే దురుద్దేశంతో ఆరోగ్యశ్రీని నీరు కార్చేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. దీనివల్ల పేదల ప్రాణాలకు రక్షణ కరువయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రైవేటు మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేయటం వల్ల విద్యార్థులకు వైద్య సీట్లు, మరింత మెరుగైన వైద్యసేవలు అందే అవకాశం ఉందన్నారు. కానీ వారికి కావాల్సిన వారికి లబ్ధి చేకూర్చేందుకు చంద్రబాబు ప్రైవేటీకరణ చేస్తున్నారని ఆరోపించారు. వైద్యకళాశాలలు ప్రైవేటీకరణ చేయటం వల్ల పేదలకు వైద్యసేవలు దూరం అవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.

నకిలీ మద్యం కేసులో అడ్డంగా దొరికిపోయిన టీడీపీ నేతలు ఏం చేయాలో తెలియక వైఎస్సార్ సీపీ నేతల పైకి నెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు అన్ని విషయాలు గమనిస్తున్నారని తెలిపారు. కోటి సంతకాల కార్యక్రమంలో ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని చెప్పారు. వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయానికి మద్దతు తెలుపుతూ ప్రజలు పెద్ద ఎత్తున సంతకాలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కనపర్తి కొండా, భోగాది మురళి, రవి చంద్ర, ఝాన్సీ రాణి, కగ్గా పాండు, చిన్నారావు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

19న ముత్తుస్వామి దీక్షితార్ ఆరాధనా మహోత్సవం

విజయవాడ కల్చరల్: సుబ్రహ్మణ్య సంగీత సమితి ఆధ్వర్యంలో సంగీత మూర్తి త్రయంలో ఒకరైన ముత్తుస్వామి దీక్షితార్ ఆరాధనా సంగీత్సవ కార్యక్రమాన్ని 19 వ తేదీ గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో నిర్వహిస్తున్నట్లు సంగీత సమితి కార్యదర్శి సీవీరావ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన సంగీత విద్వాంసులు, యువ సంగీత కళాకారులు ముత్తుస్వామి దీక్షితార్ రచించిన కీర్తనలు గానం చేస్తారని తెలిపారు.

సన్నాల మృతి తీరని లోటు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రముఖ చిత్రకారులు, ఆంధ్ర అకాడమీ ఆఫ్ ఆర్ట్స్, ఎం.ఎస్. మూర్తి లలిత కళా గ్యాలరీ ఉపాధ్యక్షుడు సన్నాల సత్యనారాయణ వరప్రసాద్ మృతి చిత్ర కళారంగానికి తీరని లోటు అని ఆంధ్ర అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ కార్యదర్శి ఎం.వి. సాయిబాబు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 1972 నుంచి ఇప్పటి వరకూ 53 సంవత్సరాలుగా ఆంధ్ర అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ ద్వారా అనేక హోదాల్లో ఆయన కళాభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. ఆయన గీసిన చిత్రాలు అనేక ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలలో దర్శనమిస్తూ ఉంటాయని చెప్పారు. ఆయన భౌతికంగా లేకున్నప్పటికీ ఆయన గీసిన చిత్రాల ద్వారా ప్రతి ఒక్కరి హృదయంలో నిలిచే ఉంటారని తెలిపారు.